# అర్థ-నారి

స్నానానికని పరికరాలన్నీ పట్టుకుని, మెట్లు దిగుతున్నాను. దిగువను, కులాయిదగ్గిర, మా తాయారమ్మ ఎవరిమీదనో గొంతుచించుకుంటూంది:

తెల్లవారగానే ఎవరా, అక్షింతలు వేయించుకునేందుకు అప్పుడే తయారైనారు అనుకుంటూ, యింకో రెండు మెట్లుదిగి, పక్కనున్న కటకటాలలోనుంచి, ఆవారకు పరకాయించాను.

గుమ్మంలో – ఆ మనిషి, నదురూబెదురూ లేకుండా, అంటూన్నది తన్ను కాదన్నట్టు నిలుచుని ఉంది. తాయారమ్మ కుళాయి మొగదలనుంచి, ముఖం కండలు చించుకుంటూ, మీదికి లంఘించబోతూంది.

--'ఎత్తింది ఆడజన్మ కాదటే!...'

'సిగ్గు ఉండక్కర్లా?--'

'ఫో.......................'

'పోవేం' అంటూ చేతిలోవున్న చెంబుకాస్తా ఆ మనిషిమీదికి గిరవాటు వేసింది.

అవతలమనిషి, తొణకకుండా అది అందిపుచ్చుకుని మళ్ళిపోతూంది. దాని, ఓ గాయిత్యం చూసి, అరచుకుంటూ 'దొంగ – దొంగ–' అని పొలికేకలతో ఊరూ – నాడూ ఏకంచేస్తూ, తాయారమ్మ వీధిలో పోయి పడ్డది.

వాళ్ళనడుమను, నలుగురూ పోగైనారు. తలొకడూ తలోమాదిరిగానూ నిలవేసి గద్దిస్తున్నారు...... పట్టపవలే యింటో జొరబడి, దోచుకుపోతూందని.

'లేదూ! – ఆ తల్లి, నా మీదికి బిచ్చం పారేసింది. పుచ్చుకుపోతున్నాను–' అంటూంది ఆ మనిషి.

తాయారమ్మ అందరిలోనూ, ముక్కుమీద వేలేసుకుంది--

'పొమ్మని గిరవాటువేస్తే...'

'--వేసింది బిచ్చమనుకుని పుచ్చుకున్నా అమ్మా...'

మేమందరం పకాల్‌మన్నాము.

"వేసే తల్లులందరూ...యింతే, యిలా మొగాన విసిరేస్తారు బాబూ – నూటికో కోటికో ఓ తల్లి యిందవే అమ్మీ అంటూ, జాలితలుస్తుంది కాని..."

--నా మనసు జివ్వుమన్నది.

ఒక్కరూ తన్ను వెనకేసుకురాకుండా, బెల్లంకొట్టిన రాళ్ళల్లే ఉండటం చూసి, తాయారమ్మ నిప్పులేకుండానే తగులడిపోతూంది...

"ఏమిట్రా చూసేది – సిగ్గుమాలినకుంకల్లారా!– ఆడది గుడ్డ ఊడదీసుకువస్తే ఏమిట్రా చూసేది" అని, చుట్టూ నుంచున్న కుర్రాళ్ళనందర్నీ కసరి, దానిచేతుల్లోంచి ఆ చెంబు ఊడలాక్కుని, ఏడుపు మొగంతో యింట్లోకి పారిపోయింది.

అందరూ, ఎవరిగుమ్మాల్లోకి వాళ్ళు పోయినారు. ఆ మనిషొక్కతే మిగిలింది.... నేనుకూడా అక్కడ అందాకటినుంచీ నిలుచున్నామన్న సంగతి అప్పుడు నాకు తెలిసొచ్చింది. దాని ఒంటిమీద నా రెండు గ్రుడ్లూ సిగ్గుమాలి పొరలాడుతున్నాయ్!...

"పో బాబూ, మొండి మొలేసుకొచ్చింది మొగాళ్ళ కోసం కాదు. నీ మానాన నీవు పో!––"

కత్తివాటంగా, అని చీరముడుత రవంత క్రిందికి లాక్కుంది. నేను మేకపోతల్లే గొంతు గొణుక్కుంటూ, మామూలుగా లార్చి – జేబు వ్రేళ్ళాడే అంతమేరా తడుముకున్నాను.

"అబ్బో! దిగివచ్చాడు, ధర్మరాజు!"

దానిమాటల్లో, ఎంత మంట ఉందని? ఎందుకూ యీ బసివికి నా మీద యింత కోపం? – పుణ్యానికిపోతే పాపం ఎదురైనట్లు – పోనీ పాపం! అని దానిస్థితికి జాలిపడి–

ఇన్నిముక్కలూ పట్టుకు తిట్టేశాను. విని, విని, చివరకు, అది ఛర్రమంది...

"వయసూ, వళ్లూ అమ్ముడుపోకుండా అడుక్కుతింటున్నామనేనా – మా రాజా యీ ఆగ్రహం అంతా... అంటూ మెత్తని కత్తికోతగా – రెప్పవాల్చకుండా అడిగింది...

నేను, గుక్కతిప్పుకోలేక, ఒక్క అంగలో యింట్లోకి దూకి, మెట్లన్నీ ప్రాకి – దిండుతోబాటు గోడకి కూలబడ్డాను. సబ్బుపెట్టె అదిరిపడి...బావురుమంది. స్నానానికని క్రిందకు వచ్చినవాడికి...దాని విసురుకు మళ్ళా ఎప్పటిచోటికే వచ్చిపడ్డానా?–

చట్టకు సత్తువ తెచ్చుకుని...బాసెపట్టుమీద, లేచి కూర్చుంటున్నాను...గుమ్మంమీద అది నిలుచుని ఉంది.

'ఏం బాబూ...నేను జ్ఞాపకం రాలేదా?' – అంటూ అడుగు లోపలికి వేసింది...

నాకు – యింకా జ్ఞప్తికి రాలేదు.

"నేను – సీతాయినయ్యా! పదేళ్ళక్రితం – నేనూ – మా అమ్మా, మీ పాదాలకడ బ్రతికేవాళ్ళం..."

ఆс – అదా యిది!* – పనిచేస్తూ చేస్తూనే ఒకనాడు ఉన్నట్టుండి, చెప్పకుండా యిద్దరూ మాయమైనారు. వాకబు చేశాను. కాని ఎటుపోయినారో ఎవళ్లూ చెప్పలేదు. సరే, వీళ్ళ సంగతి ఎన్నాళ్ళు జ్ఞాపకం ఉంటుంది? అప్పుడే మరచిపోయినాను. – ఇది ఇంత పెరిగి పెద్దదైందా? – దీని అమ్మ ఏమైనట్టు? – బాగుందా?

నా మనసులో సందేహాలు అన్నింటికీ అది జవాబులు చెపుతూంది––

––"ఆవాళ, మాపటేల – సందుమలుపులో, నా చెయ్యిచ్చుకున్నారా? – అదిరిపోయి బేవురుమన్నాను కదూ? అప్పుడెప్పుడో చేసిన పాడుపనికి, యిప్పుడు సిగ్గెందుకులెండి – చేయిగుంజుకుని ఆపళాన పోయి, మా అమ్మమీద పడి, చెప్పడానికి

జివ్వాచచ్చిపోయి, ఎలాగో మొత్తుకున్నాను. మా అమ్మ బెంబేలుపడిపోయి - నెత్తీనోరూ కొట్టుకున్నది - ఆవాళనుంచే మీ యింట్లో పని మానిపించింది. మళ్ళా జీతం అడిగేందుకైనా, మీ యింటి చాయలకు రాలేదు మేము. మా అమ్మంటే - మంచి నీతైన మనిషి బాబూ!

కొన్నాళ్ళు రోజులు ఎల్లాగో వెళ్ళమారించుకున్నాం. మా అమ్మకు అనాటికి అనాటికి కొనఊపిరిపడుతూంది. నా రెక్కలే మా యిద్దరికీ కాచిపోయాలి. పడుచుపిల్లలంటే - పనీపాటా చేయడానికి రమ్మని ఎవళ్ళుపడితే వాళ్ళు పిలుస్తారు. కాని, రెక్కల కష్టంతో పోనిస్తారా - అడిగినదానికల్లా అచ్చుకుంటేనే, ఆ నెలకు జీతం ముట్టజెప్పేది.

అలా బ్రదుకుదామంటే, నాకు తగనిరోత - మా అమ్మకు అంతకంటే చీదర.

అడుక్కు తిందామని, ఊరిమీదపడ్డాం. కాని ఏం లాభం - ఎంత గొంతుచించుకున్నా పూటకు చేరెడుగింజలు జోలెలో రాలేవుకావు - ఏ మొగాణ్ణి దేవురించినా కన్ను గొట్టి నిదానించేవాడేకాని, కనికరించి ఓ కానిడబ్బు మా మొగాన కొట్టేవాడుకాదు. ఏ అమ్మలక్కను బ్రతిమాలినా ఏతల్లి కాతల్లి ఇల్లా 'ఎత్తుకు తినకపోతే, దుక్కలాగా ఉన్నావ్, ఎక్కడన్నా పనీ పాటా చేసుకోరాదుటే!' అని కసిరికొట్టేది.

ఏమిటి - వయసులో ఆడదిచేసే పనీ పాటా? - లోకంసంగతి నీకు ఎరుకలేని దేమిటి బాబూ...

నన్ను అమ్ముకునన్నా నన్ను కన్నదాన్ని పోషించుకుందామనుకున్నా - నిబ్బరం తెచ్చుకుని బయలుదేరేదాన్ని. కాని, మొగాడికన్ను మా పాపిష్టిది బాబూ - కన్ను మీద వాలిగేసరికల్లా కాళ్ళు గజగజలాడేవి. ఛీ అనుకుని మళ్ళిపోయేదాన్ని --

పట్టపగలే దొంగతనం మొదలెట్టా. పట్టుబడ్డా - కొట్లో కూచున్నా. ఒకసారి కాదు, యిప్పటికి ముమ్మాటైంది...

ఇలా తిరుగుతూవుంటా మళ్ళా జైలుకు వెళ్ళేదాకా...

అడకూతురికి - జాలిపుట్టించడం మా సులువయ్యా! ఇలా ఒళ్ళుకనబడేట్టు, చాలీచాలంది ఓ చింకిచుట్టుకుని, బిక్కమొగంవేసుకుని, సాటి అడకూతుర్ని "తల్లీ, మొలచుట్టూ బట్టలేక, ఇలా మానానికి మ్రగ్గిపోతున్నా మాయమ్మా"- అని అరిచానా అంటే, ఆ యిల్లాలు, తన గుట్టంతా బట్టబయలైనట్టు కంపరం ఎత్తిపోయి, తన మొగుడి కంట నేను పడకుండా ఏదో పాత కోకొకటి నా మొగాన కొట్టి తరిమేస్తుంది. అది, మారుబేరానికి అమ్ముకుంటే - మా ముసిల్దీ నేనూ, వారం రోజులు కడుపునిండా ముప్పొద్దులూ బువ్వతింటాం.

వచ్చిన వీధికి మళ్ళీ రాను. అడిగిన తల్లిని మళ్ళీ అడగను - ఎత్తుకు తినేందుకు ఎన్ని వాడలైనా ఉన్నాయికదండీ! -- ఏం, మా బ్రతుకు బాగుండలా?'

నా మెదడంతా కరిగి కళ్ళల్లో పేరుకుపోయింది.

"ఓసి నీ బ్రతుకు బండలుకానూ - గదిలో లేవిణీ వేశావుటే" అని అరుచుకుంటూ, తాయారమ్మ అక్కడికి గంతువేసింది. కాకపోతే, దాన్ని జుట్టుపట్టుకు క్రిందికి ఈడుస్తానన్నది. మళ్ళీ చూడబోతే గడ్డాలూ మీసాలూ వచ్చిన పెద్దమనిషిని నాకు బుద్ధి ఉండక్కర్లేదా...అంది. పట్టపగలే, అందరూ చూస్తూండగానే భార్లాగా

ఇలా చేస్తావా అంది. నలుగురిని పోగుచేసి నాకు బుద్ధిచెప్పిస్తానంది... తక్షణం గది ఖాళీచేసేయమంది. నేను వింటూ, ఇల్లరికపు అల్లుడికిమల్లే గ్రుక్కమింగి ఊరుకున్నాను.

"మళ్ళీ యీ జాడ నెప్పుడన్నా వస్తే చూసిపోతాలే బాబూ..." అంటూ అది, చెక్కు చెదరకుండా మెట్లుదిగి పోతూంది...కడసారిమెట్టుదగ్గిర ఆగి, "యీ యిల్లాలితో ఎలా వేగుతున్నావు మారాజా!" అని నవ్వుకుంటూ పోయింది.

ఏదో యింట్లో అద్దెకు ఉన్న పరాయివాణ్ణి అయిపోయినాను. కాని, నిజంగా కట్టుకున్న మొగుణ్ణే అయితే, దానిచేత అంత మాటపడి తాయారమ్మ నన్ను బ్రతుకనిచ్చేదా? గదితలుపు గడియ, ఎంత బందోబస్తుగా ఉన్నా - ఆ చేతికీ - నోటికీ అడ్డంవచ్చేదా? పాయె - పో!

సీతాయ్‌బ్రతుకు చివరకు ఇలా అయిందా? ఎలా తెలవారుతుందో - దేశంలో ఎంతమంది పడుచులు... ఇలాగే సీతాయ్‌లు అయిపోతున్నారో!

హుఁ -- ఇలాంటి చరిత్రాత్మకములైన చచ్చు ప్రశ్నలు లక్షాతొంభై, తెలుగువాణ్ణి కనుక పరాఖత్‌గా నాకు నేను వేసుకోగలను. ఎందుచేతనా, వాటికి జవాబు చెప్పకునే బాధ్యత, నాకూ, నా జాతికీ - వేదకాలంనుంచీ లేదు!

★ ★ ★